## క్లుప్తంగా

### టౌన్ ఎస్ఐగా మధుసూదన్‌రెడ్డి



ఎమ్మిగనూరురూరల్: పట్టణ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పి. మధుసూదన్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన టౌన్ ఎస్ఐ డాక్టర్ నాయక్ ఇస్వీ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ కాగా, ఆయన స్థానంలో కర్నూలు సైబర్ క్రైం నుంచి పి.మధుసూదన్‌రెడ్డి నియమితులయ్యారు. బాధ్యతలు చేపట్టిన ఎస్ఐకు టౌన్ సీఐ వి. శ్రీనివాసులు, పోలీస్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

### కమిషనర్ విస్తృత పర్యటన



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఆదోని టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. ఎంఎం రోడ్డు, పాత బస్టాండు, రైతుబజార్, రైల్వే స్టేషన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో కలియ తిరిగారు. మురుగు కాలువల్లో పూడికతీత పనులను పరిశీలించారు.

### ఆలయానికి రూ.2 లక్షల విరాళం



నగదును అందజేస్తున్న రైల్వే ఈరన్న

ఆదోని అర్బన్: పట్టణంలోని కోట చంద్రమౌళీశ్వర దేవాలయం అభివృద్ధి కోసం రైల్వే ఈరన్న శుక్రవారం రూ.2 లక్షలు విరాళంగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ మున్ముందు స్వామివారి ఆలయ అభివృద్ధికి విరాళాలు అందజేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. దాతకు, వారి కుటుంబానికి ఆ చంద్రమౌళీశ్వరస్వామి వారి ఆశీస్సులు ఉండాలని ఆలయ అర్చకులు పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రెసిడెంట్ రవి, ఆలయ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

### పారిశుద్ధ్య పనుల పరిశీలన



13వ వార్డులో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని 13వ వార్డులో పారిశుద్ధ్య పనులతో పాటు, మంచినీటి సరఫరాను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. డ్రైనేజీల్లో క్రమం తప్పకుండా చెత్తాచెదారాన్ని తొలగించాలని, పారిశుద్ధ్య పనుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈలు మదన్‌కుమార్, శరత్‌చంద్ర ,శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



కారును తనిఖీ చేస్తున్న సీఐ, సిబ్బంది

ఆదోని అర్బన్: వాహనదారులు రోడ్డు ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు అన్నారు. శుక్రవారం విజిబుల్ పోలీసింగ్ మరియు వెహికల్ చెకింగ్‌లో భాగంగా పట్టణంలోని భీమాస్ సర్కిల్‌లో వాహనాల తనిఖీ చేశారు. రికార్డులు లేని వాహనాలకు జరిమానాలు విధించారు. ట్రాఫిక్ నియమనిబంధనలు ప్రతిఒక్కరూ పాటించాలని సూచించారు.

### ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



రోగికి ఈసీజీ తీస్తున్న వైద్య సిబ్బంది

ఆదోని అర్బన్: ఆదోని డివిజన్ జంగమ అర్చక సమాఖ్య మరియు శ్రీ అల్కూరు మఠం సిద్ధయ్యస్వామి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదోనిలోని శ్రీ మల్లికార్జున విద్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. మొత్తం 161 మందికు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యుడు అల్కూరు మహర్షి విజయ్ కుమార్ తెలిపారు. వైద్యశిబిరంలో గుండె, ఈసీజీ, 2డీ ఎకో ఎస్ఆర్, ఎముకలు, చెవి, ముక్కు, గొంతు, కిడ్నీ, పళ్లు, కళ్లు, బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలను కర్నూలుకు చెందిన కిమ్స్ ఆసుపత్రి వారు నిర్వహించారన్నారు.

# సాటి మనిషిపై ప్రేమ, దయ కలిగి ఉండాలి

- భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- శిలువను మోసి భక్తి చాటుకున్న క్రైస్తవులు





ఆదోనిలో శిలువను మోస్తూ ర్యాలీగా వెళ్తున్న పాస్టర్ కోలా విజయ్‌కుమార్, క్రైస్తవులు, రంగప్ప కొండపై శిలువ ప్రతిష్ఠించి ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

ఆదోని సెంట్రల్: సాటి మనిషి పట్ల ప్రేమ, దయ, కరుణ, జాలి గుణం కలిగి ఉండాలని రెవరెండ్ ఫాదర్ కోలా విజయ్‌కుమార్ అన్నారు. నియోజవర్గ వ్యాప్తంగా క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే వేడుకలను జరుపుకున్నారు. ఉపవాస దీక్షలు చేసి ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. మండిగిరి పరిధిలోని కేథలిక్ చర్చి బాలయేసు ప్రార్థనా మందిరంలో రెవరెండ్ ఫాదర్ కోలా విజయ్‌కుమార్ శిలువను మోస్తూ సెయింట్ జోసెఫ్ పాఠశాల నుంచి మెయిన్ రోడ్డు గుండా ప్రార్థన మందిరానికి చేరుకున్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయన మాట్లాడుతూ శిలువ మీద పలికిన ఏడు మాటలు గుర్తు చేసుకుని వాటిని అనుసరించాలన్నారు. అలాగే విక్టోరియాపేట సీఎస్ఐ చర్చి, ఎస్‌కేడీ కాలనీలోని హోలీ ట్రినిటీ చర్చ్ పాస్టర్ విలియం సుజిత్ ప్రత్యేక ప్రార్థన చేసి దైవ సందేశం వినిపించారు. సీయోను ప్రార్థనా మందిరం పాస్టర్ తిమోతి, మహిమ చర్చి పాస్టర్ రవికుమార్, హోసన్న మినిస్ట్రీస్ క్యాథలిక్ వంటి చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

**కోసిగిలో భక్తిశ్రద్ధలతో ..**

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రై డే వేడుకలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం మండలంలోని డి.బెళగల్ గ్రామం నుంచి కోసిగి చర్చి వికార్ ఫాదర్ జాకోబ్ ఆధ్వర్యంలో శిలువను మోసుకుని పాదయాత్రగా కోసిగిలో రంగప్ప గట్టు వద్దకు చేరుకున్నారు. కొండ ప్రాంతంలో శిలువను ప్రతిష్ఠించి క్రైస్తవులు లోక రక్షకుడు ఏసు క్రీస్తు శిలువలో చెప్పిన ఏడు మాటలను గుర్తుచేసుకొని, ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాల్లోని చర్చీల్లో గుడ్ ఫ్రైడే వేడుకలు జరుపుకున్నారు. ఇందులో సుంకేశ్వరి చర్చి వికార్ పాథర్ థామస్, ఫాదర్ జాన్సర్, ఫాదర్ జిజో, ఆయా చర్చిలలో పాస్టర్లు రాజారత్నం, సురేష్, దేవపుత్ర, ప్రేమ్‌కుమార్, బ్రదర్ శ్రీను, బ్రదర్ చిదానంద, సుమిత్ర,రాజేష్, శాంతమూర్తి పాల్గొన్నారు.

**ఆత్మీయ రక్షణ కావాలంటే ఈ లోకంపై ఆశ వదులుకోవాలి**

పెద్దకడబూరు: మానవులకు ఆత్మీయ రక్షణ కావాలంటే ఈ లోకంపై ఆశ వదులుకొని ఉపవాసంతో కన్నీటి ప్రార్థనలు చేయాలని సీఎస్ఐ చర్చి పాస్టర్ రెవరెండ్ ముత్తు మనోహర్‌బాబు, ఆర్సీఎం చర్చి ఫాదర్ సంజీవ్‌రావు తెలిపారు. శుక్రవారం గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకొని పెద్దకడబూరు మండలకేంద్రంతో పాటు మండలంలోని చిన్నతుంబళం, కంబళదిన్నె, కంబదహాల్, హెచ్. మురవణి, మేకడోణ తదితర గ్రామాలలోని చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని చర్చీల్లో శుక్రవారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే జరుపుకున్నారు. స్థానిక ఎంబీ చర్చితో పాటు సీఎస్ఐ, ఇతర చర్చీల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయా చర్చిలలో పాస్టర్ రెవరెండ్ జయన్న, సెక్రటరి భాస్కర్‌బాబు తదితరులు క్రీస్తు దైవ బోధనలు వినిపించారు.

**కోటేకల్‌లో శిలువ యాత్ర**

ఎమ్మిగనూరురూరల్: గుడ్‌ఫ్రైడే సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ఆర్సీయం చర్చి నుంచి కోటేకల్ గ్రామంలోని కొండపైకి శిలువను మోస్తు క్రైస్తవులు యాత్రను నిర్వహించారు. పాస్టర్లు చిన్నప్ప, సుందరరాజులు కోటేకల్ కొండపై 14 స్థలముల్లో ధ్యానించారు. క్రీస్తు శిలువపై పలికిన ఏడు మాటలను వివరించారు. కార్యక్రమంలో ఫాదర్లు తరుణ్, మీలోని, హాని, రాణి, సంఘ పెద్దలు తదతరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండల కేంద్రం గోనెగండ్లతో పాటు హెచ్. కైరవాడి, గాజులదిన్నె, అలువాల, కులుమాల, గంజిహళ్లి, పెద్దనేలటూర్, పెద్దమరివీడు, వేముగోడు, నెరుడుప్పల, పిల్లిగుండ్ల, ఐరన్‌బండ, ఎన్నెకండ్ల తదితర గ్రామాలలో గుడ్‌ఫ్రైడే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

గోనెగండ్లలో ఎఫ్రాతా ప్రార్థనా మందిరము, క్రీస్తుసంఘాలలో సేవకులు ఓనేసిమ్, ప్రసంగిల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఆయా చర్చిల్లో దైవసేవకులు దైవసందేశం వినిపించారు.



ఏసుక్రీస్తు శిలువ మోసుకుని పాదయాత్ర చేస్తున్న ఫాదర్ జాకోబ్



పెద్దకడబూరులోని సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలలో పాల్గొన్న క్రైస్తవులు,(ఇన్‌సెట్) పాస్టర్ రెవరెండ్ ముత్తు మనోహర్‌బాబు



ఎమ్మిగనూరు ఎంబీ చర్చిలో క్రీస్తు బోధనలు వినిపిస్తున్న పాస్టర్ జయన్న



కోటేకల్‌కు శిలువతో యాత్రగా వెళ్తున్న క్రైస్తవులు



గోనెగండ్ల ఎఫ్రాత ప్రార్థన మందిరంలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

## ప్రజా సమస్యలు పరిష్కరించాలని రిలే దీక్ష

ఆదోని టౌన్: పట్టణంలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ దేవిశెట్టి ప్రకాష్ రిలే నిరాహారదీక్ష చేపట్టారు. పాత బస్టాండు సర్కిల్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట దీక్షను చేపట్టారు. దేవిశెట్టి ప్రకాష్ మాట్లాడుతూ.. ఆదోనిలో ఆగిపోయిన మెడికల్ కళాశాల నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసి మెరుగైన వైద్యసేవలను ప్రజలకు అందించాలన్నారు. పట్టణంలోని పాత బస్టాండు సర్కిల్‌లో మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణం పనులను పునఃప్రారంభించి పూర్తి చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యాపారులు శంకర్‌రావు, వీరేష్, లక్ష్మీనారాయణ, వివిధ ప్రజా సంఘాలు, పార్టీ నాయకులు రమేష్, మహమ్మద్ నాసీర్, నవాజ్, తాయన్న తదితరులు పాల్గొన్నారు.

**ప్రజా సంఘాల మద్దతు**

పార్టీలకు అతీతంగా దేవిశెట్టి ప్రకాష్ చేపట్టిన రిలే నిరాహారదీక్షకు పట్టణంలోని ప్రజా, మహిళా, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తమ సంఘీభావాన్ని తెలియజేశారు. వైఎస్సార్‌సీపీకి చెందిన మహిళా నాయకురాళ్లు జిలేకాబీ, శ్రీలక్ష్మి, శ్రీదేవి, బీసీ సంఘం నాయకులు దస్తగిరినాయుడు, ముస్లిం మైనార్టీ పరిరక్షణ సమితి అధ్యక్షుడు నూర్ అహ్మద్, ఫొటోగ్రాఫర్, సీపీఎం నాయకులు రాంజినేయులు, వీరన్న తదితరులు, మర్చంట్స్ అసోసియేషన్, సీపీఐ, సీపీఎం, మహిళా సంఘాలు తమ మద్దతును తెలియజేశాయి.



దేవిశెట్టి ప్రకాష్‌తో మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, నాయకులు

**దీక్షను విరమింపజేసిన మాజీ ఎమ్మెల్యే**

దీక్ష చేపట్టిన దేవిశెట్టికి మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి నిమ్మరసం తాపి దీక్షను విరమింపజేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో ఆదోని అభివృద్ధి అధోగతిపాలేనని, అందుకు ప్రతిఒక్కరూ సమష్టిగా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, మండలాధ్యక్షులు గురునాథ్‌రెడ్డి, కౌన్సిలర్ రామలింగేశ్వర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### లైబ్రేరియన్ పోస్టులు భర్తీ చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్ర వ్యాప్తంగా వేలాది సంఖ్యలో ఖాళీగా వున్న లైబ్రేరియన్ పోస్టులను కూటమి ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 15 సంవత్సరాల నుంచి ఆయా పోస్టులు భర్తీకి నోచుకోలేకపోతున్నాయన్నారు. విద్యావ్యవస్థకి వెన్నెముకలాంటి గ్రంథాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, యునివర్సిటీలు, గురుకులాలు, కేజీబీవీల్లోను గ్రంథాలయాధికారుల పోస్టులను భర్తీ చేయకపోవడం దారుణమన్నారు.

### 21న మండల సర్వసభ్య సమావేశం

గోనెగండ్ల : ఈనెల 21వ తేదీన మండలం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మణిమంజరి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ టి. నసురుద్దీన్ అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయం సమావేశ భవనంలో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, కోఆప్షన్ మెంబర్, ఇతర శాఖాధికారులు తప్పకుండా హాజరు కావాలన్నారు.

### 21న ఏపీ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

గోనెగండ్ల : 2025–26 విద్యా సంవత్సరంలో 6వ తరగతి ప్రవేశానికి ఈనెల 21న స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష ఉంటుందని ఆ పాఠశాల ప్రిన్సిపల్ షాహినా పర్వీన్ శుక్రవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ప్రవేశ పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్లను https:// cse.ap.gov.in లేదా https:// apms. apcfss. in వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్షకు సంబంధించిన దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఆదోని రూరల్: ఉపాధి కూలీల పెండింగ్ వేతనాలను చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, మండల కార్యదర్శి రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని కుప్పగల్, పాండవగల్, ఆరేకల్, ఇస్వీ తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ ఉపాధి కూలీల పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఈనెల 21వ తేదీన ఆదోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కూలీలకు పిలుపునిచ్చారు.

## ఘనంగా భీమరాయస్వామి ప్రభోత్సవం





ప్రత్యేక అలంకరణలో భీమరాయస్వామి, భక్తజనుల మధ్య ప్రభోత్సవం

పెద్దకడబూరు : మండల పరిధిలోని జాలవాడి గ్రామంలో వెలసిన భీమరాయ స్వామి ప్రభోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. తెల్లవారుజామున ఆలయ అర్చకులు గణపతి పూజ, పంచామృతాభిషేకం, ఆకుపూజ వంటి ప్రత్యేక పూజలు నిర్వహించి మహా మంగళహారతులు చేపట్టారు. సాయంత్రం పారెడ్డి తిమ్మారెడ్డి ఇంటి నుంచి కుంభాలను ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రభకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రభోత్సవ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

**నేడు మహా రథోత్సవం**

శనివారం ఉదయం భీమరాయస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం రథోత్సవానికి హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపడుతారు. సాయంత్రం సద్గురు గంగా నాగప్ప తాత ఇంటి నుంచి ఉత్సవ మూర్తిని ఊరేగింపుగా తీసుకొచ్చి రథంపై అదిష్ఠించి రథోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలు తెలిపారు.



నేలకొరిగిన వరిపంట

## అకాల వర్షం.. అపార నష్టం

కౌతాళం: మండలంలో శుక్రవారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి వరి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ముఖ్యంగా మండల పరిధిలోని మేళిగనూరు, నదిచాగి, మరళి గ్రామాల్లోని వరి రైతులు ఆకాల వర్షంతో తీవ్రంగా నష్టపోయారు. దాదాపు 50 ఎకరాల్లో పంట దెబ్బతినింది రైతులు రమేష్ గౌడు, నాగరాజు, వీరయ్య వాపోయారు. మరో నాలుగు రోజుల్లో పంట కోతకు వచ్చే సమయంలో ఈదూరు గాలులతో కూడిన వర్షం కురవడంతో చేతికి వచ్చిన వరి పంట నెలమట్టం అయ్యింది. కోతకు సిద్ధంగా ఉన్న వరిపైరు నేలవాలింది. ఇప్పటికే కోసి కళ్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. వేలకు వేల రూపాయలు పెట్టుబడి పెట్టి మరో నాల్గు రోజుల్లో పంట చేతికి వస్తుంది అన్న ఆశతో ఉన్న తమపై ప్రకృతి ప్రకోపించిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. నష్ట పోయిన పంటకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించి తమకు అన్ని విధాలుగా ఆదుకోవాలని వారు కోరారు.



ఆరబెట్టిన వరిపై టార్పాలిన్ కప్పుతున్న రైతన్నలు

## అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నివారణ



ఎమ్మిగనూరులో అగ్నిప్రమాదాలను నివారించే విధానాన్ని ప్రదర్శిస్తున్న ఫైర్ ఆఫీసర్



ఆదోనిలో పెట్రోల్ బంకు సిబ్బందికి అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: అప్రమత్తంగా వ్యవహరిస్తే అగ్నిప్రమాదాలు అరికట్టవచ్చని స్థానిక ఫైర్ శాఖ అధికారి జి.రామాంజినేయులు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని శిల్పా ఎస్టేట్‌తో పాటు ఎంజీ పెట్రోల్ బంక్ ప్రాంతాల్లో వంటగ్యాస్ లీకై మంటలు వ్యాపిస్తే ఎలా అదుపు చేయాలన్నదానిపై అపార్ట్‌మెంట్ వాసులకు, పెట్రోల్ బంకుల్లో సిబ్బందికి ప్రదర్శన ద్వారా వివరించారు. ఆయన మాట్లాడుతూ ఇళ్లలో వంటగ్యాస్ లీకై మంటలు వ్యాపించినప్పుడు భయాందోళనలకు గురికాకుండా వాటిని అదుపులోకి తీసుకొచ్చేందుకు తగిన జాగ్రత్తలు పాటిస్తూ.. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించాలని సూచించారు.

**అగ్ని ప్రమాదాలపై అవగాహన**

ఆదోని అర్బన్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా 5వ రోజు శుక్రవారం అవగాహన కార్యక్రమాలు కొనసాగాయి. పట్టణంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకు, లక్ష్మీ చెన్నకేశవ ఆయిల్స్, రిలయన్స్ పెంట్రోల్ పంపు వద్ద అగ్నిమాపక ప్రమాదాలపై ఇన్‌చార్జ్ అగ్నిమాపక అధికారి రామాంజనేయులు ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. పెట్రోల్ బంకు వద్ద అగ్నిప్రమాదం జరిగినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు.

## వక్ఫ్ సవరణ చట్టంతో దేశ ఐక్యతకు భంగం

కౌతాళం: వక్ఫ్ సవరణ చట్టం వల్ల దేశ సమగ్రతకు, ఐక్యతకు భంగం వాటిల్లుతుందని, లౌకికవాదం పూర్తిగా నశిస్తుందని అందువల్ల వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకిస్తున్నామని అవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుభాన్ అన్నారు. వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా అవాజ్ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున శాంతియుత నిరసన ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. శుక్రవారం ప్రత్యేక ప్రార్థనల అనంతరం మండల అవాజ్ కమిటీ ఆధ్వర్యంలో కౌతాళంతో పాటు చుట్టు పక్కల గ్రామాల ముస్లింలు, సీపీఎం, సీపీఐ, రైతు కూలీ సంఘం, ప్రజా సంఘాలైన జైభీమ్, దళిత సమైఖ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూర వీధుల గుండా శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించి వైఎస్సార్ సర్కిల్‌లో రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమంలో ఖాదర్‌లింగస్వామి దర్గా ధర్మకర్త మున్నపాషా, సీపీఐ మండల కార్యదర్శి ఈరన్న, సీపీఎం సీనియర్ నాయకుడు మల్లయ్య, జైభీమ్ వ్యవస్థాప అధ్యక్షుడు అవతారం, కౌతాళం సర్పంచ్ పాల్‌దినకర్, ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి వీరేష్, అవాజ్ కమిటీ నాయకులు మహమ్మద్‌గౌస్, ఇసాక్, అబ్దుల్‌షుకుర్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

## తవ్వారు.. వదిలేశారు!



రోడ్డుపై తవ్విన గుంత మూయకుండా వదిలేసిన దృశ్యం

ఆదోని అర్బన్: పట్టణంలోని బసాపురం రోడ్డు వ్యవసాయ మార్కెట్ యార్డు గేటు సమీపంలో గత వారం పైపు లీకేజీ అయ్యి భారీ ఎత్తున మంచినీరు ప్రవహించింది. దీంతో సంబంధిత అధికారులు, సిబ్బంది లీకేజీ అయిన చోట గుంతను తవ్వారు. అయితే నేటికీ ఎనిమిది రోజులు కావొస్తున్నా గుంతను పూడ్చివేయకుండా వదిలేయడంతో రోడ్డుపై రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అటువైపు వెళ్లే బసాపురం గ్రామానికి వెళ్లే ప్రజలు, మార్కెట్‌యార్డుకు దిగుబడులను అమ్మకానికి తీసుకెళ్లే రైతులు, వాహనదారులు, స్థానికులకు అవస్థలు పడుతున్నారు. అంతేగాకుండా మేదర్‌గేరిలో రైల్వేగేటును క్లోజ్ చేయడంతో బ్రిడ్జిపై నుంచి వచ్చి వెళ్లేందుకు ఈ రోడ్డును కూడా క్లోజ్ చేయడంతో ప్రత్యామ్నాయ దారులు వెతుక్కోవాల్సి వస్తోందని స్థానికులు, రైతులు, బసాపురం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టి గుంతను పూడ్చాలని కోరుతున్నారు.

### వేదావతి ప్రాజెక్టు పనులు ప్రారంభించాలి

ఆలూరు: హాలహర్వి మండలం గూళ్యం గ్రామ సమీపంలో వేదావతినదిపై ప్రాజెక్టు పనులను కూటమి ప్రభుత్వం వెంలనే ప్రారంభించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ప్రాజెక్టు పనులు చేపట్టేంత వరకు సీపీఎం నాయకులు, కార్యకర్తలు, డీవైఎఫ్ఐ నాయకులు,హమాలీసంఘం నాయకులు పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పీఎస్.రాధాకృష్ణ పిలుపుఇచ్చారు. శుక్రవారం స్థానిక జ్యోతి బస్ భవన్‌లో సీనియర్ నాయకుడు కేపీ. నారాయణస్వామి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన రైతులు, రైతు సంఘం నాయకులు, మహిళా రైతులతో సమావేశం నిర్వహించి ప్రాజెక్టుపై చర్చించారు. దేవనకొండ మండలంలో వైఎస్సార్ హయాంలో హెచ్ఎన్ఎస్ ద్వారా కాలువలను తవ్వించి పందికోన రిజర్వాయర్ నుంచి ఆ మండలంలో 45 వేల ఎకరాలకు సాగునీటిని అందించడంతో నేడు పలు గ్రామాలకు చెందిన రైతులు బంజరు భూముల్లో బంగారు పంటలను పండిస్తున్నారని చెప్పారు. సీపీఎం మండల కార్యదర్శి షాకీర్,మైనా పాల్గొన్నారు.

### ఉత్సవాలు ప్రారంభం

ఆస్పరి: మండలంలోని శంకరబండ, బిణిగేరి గ్రామాల్లో శుక్రవారం లింగమేశ్వర స్వామి, ఆంజనేయస్వామి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయాల్లో స్వామి వార్లకు గంగ, ఆకుపూజ, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు.